# బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 28 నవంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అందరూ తమతో టచ్ లో ఉన్నారంటూ తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గాంధీ భవన్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో చిట్ చాట్‌లో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పట్టుకొని కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని, కాంగ్రెస్ ప్రభుత్వంపై, కలెక్టర్లపై సైతం తనకు ఇష్టమున్నట్లు మాట్లాడుతున్నాడని అన్నారు కేటీఆర్ మాట్లాడే మాటలతో ఆయన మైండ్ సెట్ అర్థం చేసుకోవచ్చు అన్నారు. వివరాలు 2వ పేజీలో

## 30 నుంచి




# బీఆర్ఎస్ గురుకుల బాట

- డిసెంబర్ 7 వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల బాట కార్యక్రమం
- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఐదు సభ్యులతో గురుకుల అధ్యయన కమిటీ
- పార్టీకి నివేదిక సమర్పించనున్న కమిటీ
- ఈ నివేదిక అంశాలను సభలో లేవనెత్తనున్న బీఆర్ఎస్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వరుసగా కొనసాగుతున్న మరణాలు విషాద సంఘటనల నేపథ్యంలో ఆయా విద్యాసంస్థల్లో నెలకొన్న పరిస్థితులను తెలుసుకునేందుకు పార్టీ తరపున గురుకుల బాట పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 30 తేదీ నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని కేటీఆర్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నేతలు పరిశీలించనున్నారని తెలిపారుబాలికల విద్యాసంస్థల్లో పార్టీ తరఫున విద్యార్థి విభాగం మహిళా నాయకులు, పార్టీ మహిళా నాయకులు సందర్శిస్తారని కేటీఆర్ తెలిపారు. జడ్పీ చైర్మన్లు ఎంపీపీలు, ఎంపీటీసీలు కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మహిళా సీనియర్ నాయకులు గురుకుల విద్యాసంస్థలను సందర్శించి బాలిక సమస్యలను అధ్యయనం చేసి నివేదిక ఇస్తారని చెప్పారు.

గురుకుల, పాఠశాల విద్యను రేవంత్ రెడ్డి సర్కార్ సంక్షోభంలోకి నెట్టిందని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రాష్ట్ర వ్యాప్తంగా 48 విద్యార్థులు మరణించడం బాధాకరమన్నారు. విద్యాసంస్థల్లో ఉన్న దుర్భరమైన పరిస్థితులను తట్టుకోలేక 23 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని, 8 మంది అనుమానాస్పదంగా మృతి చెందారన్నారు. నలుగురు విషాహారం తిని, మరో 13 మంది అనారోగ్యంతో చనిపోయారన్నారు. అంతేకాకుండా గత ఏడాది కాలంలో 38 సార్లు ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరిగాయని చెప్పారు. 886 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన హాస్పిటల్ పాలు కాగా నలుగురు విద్యార్థులు మరణించారన్నారు. వాంకిడిలో విషాహారం తిని శైలజ అనే విద్యార్థిని చనిపోయిన ఘటన మరవకముందే మహబూబ్ నగర్ జిల్లాలో వరుసగా ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరగటం చూస్తుంటే ఈ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో అర్థం చేసుకోవచ్చన్నారు.

గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల పరిస్థితులను అధ్యయనం చేసేందుకు బీఆర్ఎస్ తరపున అధ్యయన కమిటీ వేస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో గురుకుల అధ్యయన కమిటీ వేశామని చెప్పారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సహా సభ్యులుగా డాక్టర్ ఆంజనేయులు గౌడ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, రాజారామ్ యాదవ్, వాసుదేవ రెడ్డి ఉంటారన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారికి విద్యా సంస్థల నిర్వహణ, అక్కడి సమస్యలపై సమగ్ర అవగాహన ఉందని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు.నవంబర్ 30 నుంచి డిసెంబర్ 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా గురుకుల బాట కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ అధ్యయన కమిటీ బీఆర్ఎస్ పార్టీకి నివేదిక సమర్పిస్తుందని తెలిపారు. ఈ నివేదిక అంశాలను శాసనసభలో లేవనెత్తుతామని స్పష్టం చేశారు ముఖ్యమంత్రికి పరిపాలన అనుభవం లేకపోవటం, కీలకమైన విద్యాశాఖను ఆయన తన దగ్గరే పెట్టుకొని నిర్లక్ష్యం చేస్తుండటం విద్యార్థుల పాలిట శాపంగా మారిందన్నారు. మొదటి సంఘటన జరిగినప్పుడే ఈ ముఖ్యమంత్రి స్పందించి ఉంటే ఇంత మంది విద్యార్థుల ప్రాణాలు పోయి ఉండేవి కాదన్నారు. ఇంత జరుగుతున్నా కూడా ఈ ముఖ్యమంత్రికి ఆ పిల్లల తల్లితండ్రులు కడుపుకోత కనిపించటం లేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఢిల్లీకి 28 సార్లు వెళ్లటానికి ముఖ్యమంత్రికి సమయం ఉంది కానీ బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చనిపోతుంటే కనీసం ఒక్కసారి కూడా సమీక్ష నిర్వహించాలన్న సోయి లేదా అని ఆయన ప్రశ్నించారు.

నిర్వహణ చేతకాక ఈ ప్రభుత్వం గురుకుల, పాఠశాల విద్యను పూర్తిగా సంక్షోభంలోకి నెట్టిందని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులను చదవుకు దూరం చేసే కుట్రలో భాగంగా రేవంత్ రెడ్డి మిగితా 2వ పేజీలో

# పిల్లలు చనిపోతే తప్ప స్పందించరా..?

### ఫుడ్ పాయిజన్ ఘటనలపై హైకోర్టు ఆగ్రహం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో ఫుడ్ పాయిజన్ ఘటనలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలను ప్రభుత్వం సీరియస్ గా తీసుకోవడంలేదని వ్యాఖ్యానించింది. ఫుడ్ పాయిజన్ అంశం చాలా తీవ్రమైనదని తెలిపింది.

నారాయణపేట జిల్లాలో మాగనూర్లోని పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనపై తెలంగాణ హైకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ.. విద్యార్థులు కుర్ కురేలు తినడం వల్లే అస్వస్థతకు గురైనట్లు కోర్టుకు తెలిపారు. ఈ ఘటన విషయంలో బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకున్నట్లు ఏఏజీ చెప్పారు. ఈ సందర్భంగా.. సదరు అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారో నివేదిక ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. అలాగే, ఫుడ్ పాయిజన్ అయిన పాఠశాలల్లో శాంపుల్స్ సేకరించి ల్యాబ్ కు పంపాలని కోర్టు ఆదేశించింది. ఇదే సమయంలో మాగనూరు, కరీంనగర్, బురుగుపల్లి ఘటనలపై కూడా నివేదిక ఇవ్వాలని న్యాయ స్థానం కోరింది. ఈ ఘటనలపై సోమవారంలోపు రిపోర్టు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేస్తూ తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.



ఇదిలా ఉండగా వారంలో కౌంటర్ దాఖలు చేస్తామన్న ప్రభుత్వ న్యాయవాదిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జిల్లా కేంద్రంలో ఉండే అధికారిని సంప్రదించి వివరాలు సేకరించడానికి వారం వ్యవధి ఎందుకు? హైకోర్టు ఆదేశాలు ఇస్తేనే అధికారులు పనిచేస్తారా? లేదంటే పని చేయరా? అని ప్రశ్నించింది. నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తే 5 నిమిషాల్లో హాజర వుతారని తెలిపింది. అధికారులకు కూడా పిల్లలున్నారు కదా.. మానవతా దృక్పథతంతో వ్యవహరించాలని సూచించింది.

# అదానీ వ్యవహారంపై దద్దరిల్లిన పార్లమెంట్

- లోక్‌సభలో అదానీ కుంభకోణంపై చర్చ జరపాలంటూ నిరసనలు
- పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు బుధవారం దద్దరిల్లాయి. అదానీ గ్రూప్‌పై అవకతవక ఆరోపణలు, సంభాల్ హింసాకాండ, ఇతర సమస్యలపై చర్చల కోసం పట్టుబట్టుతున్న ప్రతిపక్ష సభ్యుల నిరసనలు బుధవారం లోక్‌సభ, రాజ్యసభలను కుదిపివేశాయి. ప్రతిపక్ష సభ్యుల గలభా మధ్య ఉభయ సభలు ఉదయం ఒకసారి, ఆ తరువాత పూర్తిగా వాయిదా పడ్డాయి. లోక్‌సభ సమావేశమైన వెంటనే స్పీకర్ ఓమ్ బిర్లా ప్రశ్నోత్త రాల సమయం చేపట్టారు, కానీ ప్రతిపక్ష సభ్యుల నినాదాల దృష్ట్యా సభా కార్యకలాపాలను వాయిదా వేశారు. అదానీ గ్రూప్‌పై వచ్చిన అవకతవకల ఆరోపణలపైన, సంభాల్‌లో మసీదులో ఇటీవల కోర్టు ఆదేశిత సర్వే సమయంలో చోటు చేసుకున్న హింసాకాండపైన చర్చించాలని వారు కోరారు. సభ మధ్యాహ్నం 12 గంటలకు సమావేశమైన వెంటనే వారు సభా మధ్యంలోకి మూకుమ్మడిగా దూసుకుపోయారు. సభాధ్యక్ష స్థానంలో ఉన్న బిజెపి సభ్యుడు దిలీప్ సైకియా సభకు అధికార పత్రాల సమర్పణ అనంతరం సభను గురువారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలో అదానీ వివాదంపై జెపిసి దర్యాప్తునకు డిమాండ్‌తో సహా వివిధ సమస్యలను చేపట్టేందుకు ముందుగా నిర్ణయించిన కార్యక్రమా లను సస్పెండ్ చేయడానికి సభ నిబంధన ఒకదాని కింద దాఖలైన 18 నోటీసులను చైర్మన్ జగ్దీప్ ధన్‌ఖడ్ తిరస్కరించడంతో సభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతిపక్షాల నిరసన కారణంగా సభా కార్యక్రమాలను కొద్ది సేపు వాయిదా వేశారు. ఉదయం 11.30 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు అవే దృశ్యాలు పునరావృతమయ్యాయి. దీనితో చైర్మన్ జగ్దీప్ ధన్‌ఖడ్ 'సభలో పరిస్థితి సవ్యంగా లేదు' అంటూ కార్యకలాపాలను గురువారానికి వాయిదా వేశారు. 'ఇతర ప్రాధికార సంస్థలతో కుమ్మక్కై, అదానీ గ్రూపుపై వచ్చిన అవినీతి, లంచగొండితనం, ఆర్థిక అవకతవకలు సహా దుష్ప్రవర్తనపై దర్యాప్తునకు జెపిసి ఏర్పాటు', ఉత్తర ప్రదేశ్‌లోని సంభాల్‌లో హింసాకాండ, దేశ రాజధానిలో 'పెరుగుతున్న' నేర ఘటనలకు సంబంధించిన డిమాండ్లతో ప్రతిపక్షాలు ఆ నోటీసులు ఇచ్చాయి.

అదానీ గ్రూపుపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తునకు జెపిసి ఏర్పాటుపూ సభా కార్యక్రమాలను నిలిపివేసి 267 నిబంధన కింద చర్చించాలని కాంగ్రెస్ సభ్యులు మాత్రమే కోరారు. ఇతర ప్రతిపక్షాలు వేరే సమస్యలపై అటువంటి నోటీసులు ఇచ్చాయి. సభ నిబంధన 267 కింద నోటీసులను ధన్‌ఖడ్ తిరస్కరిస్తూ, 'సభాధ్యక్షుని రూలింగ్ ప్రస్తావననే కోరుతుంది తప్ప విభేదాలకు కారణం కారాదన్న సత్సంప్రదాయాలను ఎగువ సభ ప్రతిబింబించవలసిన, అనుసరించవలసిన అగత్యం ఉంది. ఈ పరిస్థితుల్లో నోటీసులను ఎందుకు అంగీకరించడం లేదోనేను కారణాలనే వివరించాను' అని తెలియజేశారు. గడచిన 30 ఏళ్లలో సభ ప్రతిసారి 267 నిబంధనకు సంబంధించి ఏకగ్రీవ దృక్పథాన్ని ప్రతిబింబిందని కూడా చైర్మన్ చెప్పారు, 'నేను పలు సందర్భాల్లో పునరుద్ఘాటించినట్లుగా భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన శతాబ్ది చివరి త్రైమాసికంలోకి మనం ప్రవేశిస్తున్న పరిస్థితి దృష్ట్యా దృష్టిని కేంద్రీకరించడం మంచిదని భావించాను' అని ఆయన తెలిపారు. ధన్‌ఖడ్ నోటీసులను తిరస్కరిస్తూ, నిబంధనల ప్రకారం ఈ సమస్యలను ప్రస్తావించే సందర్భాలు ఉంటాయని కూడా నొక్కిచెప్పారు.

267 నిబంధన కింద ఇచ్చిన 18 వాయిదా నోటీసుల్లో కనీసం తొమ్మిది అదానీ వ్యవహారంపై కాంగ్రెస్ సభ్యుల నుంచి మిగితా 2వ పేజీలో

# నేటి నుంచి రైతుల పండుగ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి మూడు రోజుల పాటు రైతు పండుగను నిర్వహిస్తున్నది. ఈ మేరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంగా ఈ పండుగ జరగనుంది. అన్ని జిల్లాల రైతులు ఈ వేడుకల్లో పాలుపంచుకునేందుకు వ్యవసాయ, దాని అనుబంధశాఖలతో కలిసి భారీ ఏర్పాట్లు చేశారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, లాభసాటి విధానాలు, వివిధ పంట ఉత్పత్తులపై అవగాహన కల్పించేలా పలు కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతో పాటు వివిధ జిల్లాల నుంచి ఆదర్శ రైతులు కూడా ఈ సదస్సులో పాల్గొంటున్నారు. ప్రజా ప్రభుత్వం తొలి ఏడాదిలో రైతు సంక్షేమం కోసం రూ.55,336 కోట్లను ఖర్చు చేసినట్టు ప్రకటించారు. రాష్ట్రంలో 66.77 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 153 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. రూ. 2 లక్షల పంట రుణాలు మాఫీ చేశారు. 22.22 లక్షల మంది రైతుల కుటుంబాలకు దాదాపు రూ.17,870 కోట్ల రుణమాఫీ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇంకా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తామని వేములవాడ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్ కోసం ఈ ఏడాది రూ.10,444 కోట్లు సబ్సిడీగా చెల్లించిచనట్టు ప్రభుత్వం పేర్కొంది. రైతు భరోసా పథకం ద్వారా ఎకరానికి రూ.5 వేల చొప్పున మొత్తం 1,57,51,000 ఎకరాలకు రూ.7,625 కోట్ల నిధులను 69,86,519 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. నష్ట పరిహారం అందేలా పంటల బీమా ప్రీమియం రూ. 1,300 కోట్లు చెల్లించారు. ప్రమాదవశాత్తూ రైతు మరణిస్తే రూ.5 లక్షలు బీమా పరిహారం చెల్లించేలా రైతు బీమా పథకం ప్రీమియం రూ. 1,455 కోట్లు చెల్లించారు. ధాన్యం కొనుగోళ్లను కట్టుదిట్టంగా నిర్వహించామని ప్రభుత్వం తెలిపింది. దాదాపు 9 లక్షల మంది రైతుల నుంచి రూ.10,547 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించారు. రైతు నేస్తం మిగితా 2వ పేజీలో

# బీజేపీ వైపు చూస్తున్న తెలంగాణ ప్రజలు


ప్రధాని మోడీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌తో విసిగిపోయి.. బీఆర్ఎస్ దుష్టపాలన గురించి పూర్తిగా భయంకరమైన జ్ఞాపకాలను కలిగి ఉండి ఎంతో ఆశతో బీజేపీ వైపు చూస్తున్నారని ప్రధాని మోడీ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ వేగంగా విస్తరిస్తోందని చెప్పారు. తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో బుధవారం ప్రధాని మోడీ పార్లమెంట్‌లోని తన కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, వివిధ అంశాలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు తెలంగాణలో ఎలా అమలు జరుగుతున్నాయనే దానిపై ప్రధాని అడిగి తెలుసుకున్నారు. కేంద్ర పథకాలను సమగ్ర అమలు చేసేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. పలు అభివృద్ధి పనులపై చర్చించారు. కలిసి మెలిసి పని చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. 2028లో బీజేపీ అధికారంలోకి రావాలంటే ఇప్పటి నుంచే సమన్వయంతో కష్టపడి పని చేయాలని చెప్పినట్లు సమాచారం.

అనంతరం సమావేశం ఫొటోలతో ప్రధాని మోడీ ఎక్స్‌లో ఇంగ్లీష్ తోపాటు తెలుగులోనూ పోస్టు చేశారు. 'తెలంగాణ బీజేపీకి చెందిన శాసనసభ్యులు, ఎంపీలతో చాలా మంచి సమావేశం జరిగింది. రాష్ట్రంలో మా పార్టీ ఉనికి వేగంగా పెరుగుతోంది. తెలంగాణ ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్‌తో విసిగిపోయారు. బీఆర్ఎస్ దుష్టపాలన గురించి పూర్తిగా భయంకరమైన జ్ఞాపకాలను కలిగి ఉన్నారు. ఎంతో ఆశతో బీజేపీ వైపు చూస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బీజేపీ గట్టి స్వరం వినిపిస్తూనే ఉంటుంది. మా కార్యకర్తలు మా అభివృద్ధి ఎజెండాను వివరిస్తూనే ఉంటారు అని ప్రధాని మోడీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

## సరోగసీ కోసం తీసుకువచ్చిన మహిళ అనుమానాస్పద మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**

ఒడిశాకు చెందిన ఓ మహిళ హైదరాబాదులో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందింది. ఓ అపార్ట్ మెంట్ తొమ్మిదో ఫ్లోర్ నుంచి పడిపోవడంతో ఆమె మరణించింది. ఈ ఘటన సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రాయదుర్గంలో ఉన్న మై హోమ్ భూజా అపార్ట్ మెంట్ లో చోటుచేసుకుంది. మృతి చెందిన యువతి పేరు అశ్వితా సింగ్.

హైదరాబాద్ కు చెందిన రాజేశ్ బాబు, ఆయన భార్య... 25 ఏళ్ల అశ్వితా సింగ్ ను సరోగసీ కోసం హైదరాబాద్ తీసుకువచ్చారు. ఆమె ద్వారా తమ బిడ్డకు జన్మనివ్వాలనేది వారి ఆలోచన. సందీప్ అనే మధ్యవర్తి ద్వారా రూ.10 లక్షలకు ఒప్పందం కుదిరింది. అశ్వితా సింగ్‌ను రాజేశ్ బాబు దంపతులు తమ ఫ్లాట్ లోనే ఉంచారు. ఆమె భర్తకు కూడా అదే అపార్ట్ మెంట్ లో మరో ఫ్లాట్ ఇచ్చారు. అయితే, ఆమెను రాజేశ్ బాబు దంపతులు తమ ఫ్లాట్ దాటి బయటకు రానిచ్చేవారు కాదని తెలుస్తోంది. అంతే కాదు, అశ్వితా సింగ్‌ను కలిసేందుకు భర్తకు అనుమతి ఇచ్చేవారు కాదని తెలిసింది. కాగా, ఆ యువతి ఇంకా గర్భవతి కాలేదు. వచ్చే నెల నుంచి సరోగసీ ప్రక్రియ మొదలు కానుంది. అంతలోనే ఆమె తొమ్మిదో అంతస్తు నుంచి పడిపోయి మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై అశ్వితా సింగ్ భర్త మాట్లాడుతూ, రాజేశ్ బాబు తన భార్య పట్ల అనుచితంగా ప్రవర్తించేవాడని ఆరోపించాడు. అశ్వితా సింగ్ అతడి ప్రవర్తన భరించలేక, ఆ ఫ్లాట్ నుంచి పారిపోయేందుకు ప్రయత్నించి, ఆ క్రమంలోనే కిందడిపోయి మరణించి ఉంటుందని భావిస్తున్నారు. బాల్కనీకి రెండు చీరలు, ఒక దుపట్టా ముడి వేసి ఉండడాన్ని మిగితా 2వ పేజీలో

## ఇథనాల్ పరిశ్రమ పనులు నిలిపివేత

**బలగం టీవీ, ఆదిలాబాద్**

ఆదిలాబాద్ జిల్లాలోని దిలావర్ పూర్ మండలంలో ఇథనాల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయొద్దంటూ అక్కడి స్థానికులు గత 130 రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. కాగా.. ప్రజల ఆందోళనలు ఉధృతం కావడంతో రేవంత్ రెడ్డి సర్కార్ దిగొచ్చింది. ఇటీవలే జరిగిన లగచర్ల ఘటనతో పాటు పరిణామాలన్నింటినీ పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం.. కలెక్టర్‌ను రంగంలోకి దింపింది. దీంతో.. దిలావర్ పూర్ ప్రజలతో కలెక్టర్ చర్చలు జరిపారు. ప్రజలతో జరిపిన చర్చల అనంతరం.. ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మిగితా 2వ పేజీలో

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ ప్రచారం

### డిసెంబర్ 1 నుంచి 5 వరకు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల మీద డిసెంబర్ 1 నుంచి 5 వరకు బీజేపీ ప్రచారం చేయనుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించింది ఏమీ లేదని విమర్శించారు. బెదిరింపులు, తిట్ల పురాణాలు తప్ప ఏమీ సాధించలేదని అన్నారు. సమస్యలపై మాట్లాడితే నీ డీఎన్ఏ ఏమిటని మాట్లాడుతున్నారని... తన డీఎన్ఏ భారతీయ జనతా పార్టీ అని చెప్పారు. మిగిలిన వారి మాదిరి 10 పార్టీలు మారిన డీఎన్ఏ తనది కాదని అన్నారు.

తెలంగాణ బీజేపీ పార్లమెంట్, శాసన సభ్యులు పీఎంను కలిశామన్నారు. ఇవాళ 12 గంటలకు ప్రధానిని కలిశామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు తెలంగాణ లో ఎలా అమలు జరుగుతున్నాయనే దానిపై ప్రధాని అడిగి తెలుసుకున్నారన్నారు. కేంద్ర పథకాలను సమగ్రంగా అమలు చేసేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు పని చెయ్యాలని దిశా నిర్దేశం చేశారన్నారు. మహేశ్వర్ రెడ్డి మినహా ప్రధానినీ అందరం కలిశామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ప్రధానితో సమావేశం అనంతరం మేమంతా ప్రత్యేకంగా సమావేశమ య్యామన్నారు. ఎన్నికలకు ముందు అనేక రకాల హామీలు, గ్యారంటీలు.. సబ్ గ్యారంటీలు ఇవ్వడం జరిగిందన్నారు. సమస్యలపై మాట్లాడితే కేసీఆర్ ఎలా వ్యక్తిగతంగా దాడి చేసే వారో.. ఇపుడు రేవంత్ రెడ్డి కూడా అలాగే వ్యవహరిస్తున్నారన్నారు.

విపక్షాలను తిట్టడం మీద పెట్టే దృష్టి పాలన మీద పెడితే.. రాష్ట్రం పరిస్థితి బాగుంటుందన్నారు. కానీ సీఎం దీన్ని పట్టించుకోవడం లేదన్నారు. రెండ్రోజుల క్రితం కొమురంభీం జిల్లాలో.. శైలజ అనే అమ్మాయి.. ఫుడ్ పాయిజనింగ్‌తో చనిపోయిందన్నారు. దీని మీద సీఎం కనీసం దృష్టిపెట్టరన్నారు. సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయరన్నారు. సంబంధం లేని విషయాలపైనా ఆయనకు ఆసక్తి ఎక్కువ అంటూ విమర్శించారు. అందుకే బీజేపీ తరపున.. రాష్ట్ర ప్రభుత్వానికి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా.. మిగితా 2వ పేజీలో

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారు

(మొదటి పేజీ తరువాయి)

మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి తన రోల్ ప్లే చేయాలని ఆశిస్తున్నట్లు భట్టి తెలిపారు. తమ ప్రభుత్వం ఒక్క సంవత్సరమే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కోసం రూ.5000 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. కొత్త నేతలు వచ్చినప్పుడు కొన్ని రోజులు పాత వాటితో పాటు కొత్త సమస్యలు ఉంటాయి. తెలంగాణ మంత్రుల్లో అభిప్రాయ భేదాలు లేవు. మావి ఉమ్మడి నిర్ణయాలు. కానీ కేటీఆర్ ఇంకా భ్రమల్లో బతుకుతున్నాడు. కాంగ్రెస్ పార్టీని కూకటి వేళ్లతో పీకడం ఎవరివల్ల కాదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అందరూ మాతో టచ్ లో ఉన్నారు. అధికార పక్షం, ప్రతిపక్ష పార్టీ నేతలు కలవడం సహజం. మేం ప్రతి విషయంపై ఫోకస్ చేస్తూ వెళ్తున్నాం. ప్రోగ్రెసివ్ థింకింగ్, వెల్ఫేర్, డెవలప్మెంట్ అనే అంశాలతో ముందుకు వెళు తున్నాం. ప్రతి అంశాన్ని డైలీ సీరియల్ లాగా చేసుకొని బీఆర్ఎస్ నేతలు పబ్బం గడుపుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వాళ్లలాగే ఉంటుందని కేటీఆర్ అనుకుంటున్నారు.

## సరోగసీ కోసం
## తీసుకువచ్చిన మహిళ అనుమానాస్పద మృతి

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించారు. కాగా, యువతిని ఆత్మహత్యకు ప్రేరేపించాడన్న ఆరోపణలపై పోలీసులు రాజేశ్ బాబుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నట్టు రాయదుర్గం ఎస్ఐ వెంకన్న తెలిపారు. ఒడిశా యువతి, ఆమె భర్త ఎప్పటి నుంచి ఆ అపార్ట్ మెంట్ లో ఉంటున్నారన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## ఇథనాల్ పరిశ్రమ పనులు నిలిపివేత

(మొదటి పేజీ తరువాయి)

ఇదే వ్యవహారంపై ప్రభుత్వంతో చర్చించేందుకు కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో దిలావర్‌పూర్ ప్రజలతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలం కావటంతో.. ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేస్తున్నట్లు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించింది.

అయితే.. రేవంత్ రెడ్డి సర్కార్ ఏర్పాటుచేయ తలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీని.. వ్యతిరేఖిస్తూ దిలావర్ పూర్ ప్రజలు తీవ్ర స్థాయిలో ఆందోళనలు నిర్వహించారు. సుమారు 130 రోజులుగా రకరకాల పద్ధతుల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ.. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవటంతో.. ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. మంగళవారం రోజున రాస్తారోకో నిర్వహించి.. రోడ్డుపైనే వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గ్రామాల ప్రజలంతా కలిసి రహదారిపై మూకుమ్మడి ధర్నా నిర్వహించటంతో భారీ ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)



ఇప్పటికైనా నిర్మాణాత్మకంగా పాలనమీద దృష్టిపెట్టాలని కోరుతున్నామన్నారు. రాజకీయ పరమైన ఆరోపణలు, ప్రత్యారోపణలతో.. తెలంగాణ నష్టపోతోందన్నారు. తెలంగాణ గతంలో బీఆర్ఎస్, నేడు కాంగ్రెస్ కారణంగా.. రాష్ట్రం నష్టపోతోందని విమర్శలు గుప్పించారు. రాజకీయ వ్యవస్థ భ్రష్టు పడుతోందని మండిపడ్డారు.

ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులు, వ్యక్తిగత దాడులు.. అసాధ్యమైన అంశాల్లో.. ప్రజలను మభ్యపెట్టేలా పనులు చేయడంలో ఇద్దరూ ఇద్దరేనన్నారు. కాంగ్రెస్ వాళ్లు.. బీఆర్ఎస్ వాళ్లను చేర్చుకున్నారని.. బీఆర్ఎస్ వాళ్లు.. కాంగ్రెస్ వాళ్లను చేర్చుకున్నారన్నారు. చట్టాలకు తూట్లు పొడుస్తున్నారని.. సకాలంలో నిర్ణయం తీసుకోవాలని చెప్పినా.. స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలే దన్నారు. నిస్సిగ్గుగా.. కాంగ్రెస్ టికెట్ మీద గెలిచిన వారు బీఆర్ఎస్‌లో చేరి.. మంత్రుల య్యారన్నారు. ఆ పార్టీ నాయకులు.. అక్కడ గెలిచి.. ఇక్కడ మంత్రులయ్యారని.. ఇంతకన్నా సిగ్గుచేటు ఉంటుందా అంటూ ఎద్దేవా చేశారు. ఇంతకన్నా రికార్డులు, సాక్ష్యాలు ఇంకేం కావాలన్నారు. ప్రభుత్వాలు హామీల అమలుకు సమయం ఇవ్వాలని.. కానీ రెండ్రోజుల్లో హామీలు చేస్తామని రేవంత్ రెడ్డి చెప్పడం.. వందరోజుల్లో హామీలు అమలుచేస్తామని.. సోనియా గాంధీ పేరుతో లేఖలు పంపడం.. నిజం కాదా అంటూ కేంద్ర మంత్రి ప్రశ్నించారు. నిరుద్యోగులు.. రాహుల్, రేవంత్ చెప్పిన మాటలను విని మోసమోయారన్నారు. జాబ్ క్యాలెండర్ల విడుదలతో యువతను మోసం చేశారని విమర్శించారు. రైతులకు రైతు భరోసా.. కౌలు రైతులకు, రైతు కూలీలకు ఇస్తామన్న డబ్బుల సంగతేంది అంటూ కిషన్ రెడ్డి ప్రశ్నించారు.

అసలు రాష్ట్రంలో ఏం మార్పు వచ్చింది. కాంగ్రెస్ పాత అలవాటు ప్రకారం.. అవినీతి విలయతాండవం చేస్తోంది. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పూర్తిగా దెబ్బతిన్నది. గతంలో.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు అప్పులమీద ఆధారపడి ప్రభుత్వాన్ని నడిపితే.. ఇప్పుడు కూడా ఇదే పరిస్థితి. చిన్న చిన్న పట్టణాలకు కూడా డెవలప్ మెంట్ అథారిటీలు ఏర్పాటుచేసి.. డబ్బులు ఖర్చుచేస్తున్నారు. 30వ తేదీనాడు.. దీనిపై విస్తృతస్థాయిలో హైదరాబాద్ లో చర్చిస్తాం. ఆ తర్వాత డిసెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు ఇంటింటికి వెళ్తాం. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతాం. అమెరికాలో చట్టాల అమలు విషయం అక్కడి ప్రభుత్వం చూసుకుంటుంది. పార్లమెంటు ఎన్నికలకు ముందు.. ఏదో ఒక ఇలాంటి అంశాన్ని సృష్టించి.. కుట్ర చేస్తున్నారు. ఇది కుట్రపూరితమైన చర్య. బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చే ప్రయత్నం ఏనాడూ చేయలేదు. చేయదు. ప్రజాసమస్యల మీద పోరాడండి, కేంద్రప్రభుత్వ పథకాలు అమలుచేయండి.క్షేత్రస్థాయిలో నిర్మాణాత్మకంగా పనిచేయాలని మోదీ గారు సూచించారు. ఆ మార్గంలోనే మేం ముందుకెళ్తున్నాం. డిసెంబర్ చివరి నాటికల్లా.. సంస్థాగత ఎన్నికలు పూర్తవుతాయి. పార్టీకి కొత్త అధ్యక్షుడి ఎన్నిక పూర్తవుతుంది."అని కిషన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను డిసెంబర్ 1 నుంచి 5 వరకు ప్రజలకు వివరిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీల ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాష్ట్రం నష్టపోతుందని చెప్పారు. రాష్ట్రంలో రాజకీయ వ్యవస్థ భ్రష్టుపడుతోందని... కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకటేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా నిర్మాణాత్మక పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు.

# నేటి నుంచి రైతుల పండుగ

(మొదటి పేజీ తరువాయి)

పథకం ద్వారా రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించి, సలహాలు సూచనలు అందచేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల్లో క్షేత్రస్థాయి పోస్టుల్ని భర్తీ చేశారు. ఆయిల్ పామ్ రైతులకు టన్నుకు రూ.2 వేలు అదనపు ఆదాయం లభించేలా అశ్వారావుపేట ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీలో క్యాప్టివ్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. వ్యవసాయ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. రైతు రుణమాఫీకి రూ.17,869 కోట్లు, రైతు భరోసాకు రూ.7,625 కోట్లు, రైతు బీమాకు రూ.1,455 కోట్లు, పంటల బీమాకు రూ. 1,300 కోట్లు, ఉచిత విద్యుత్ కోసం రూ.10,444 కోట్లు, 2023–24 ధాన్యం కొనుగోళ్ళ కోసం రూ.10,547 కోట్లు, ప్రస్తుత సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు ఇప్పటి వరకు రూ. 5,040 కోట్లు వ్యయం చేశారు. ఈ మొత్తం రూ. 54,280 కోట్లుగా ఉన్నట్టు ప్రకటించారు.

# 30 నుంచి బీఆర్ఎస్ గురుకుల బాట

(మొదటి పేజీ తరువాయి)

ఇంత నిర్దయగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇన్ని వరుస సంఘటనలు జరుగుతున్నప్పటికీ ముఖ్యమంత్రికి చీమ కుట్టినట్టైనా లేదా అని ప్రశ్నించారు. మొదటి సంఘటన జరిగినప్పుడే ఈ ముఖ్యమంత్రి స్పందించి ఉంటే విద్యార్థుల మరణాలు జరిగి ఉండేవి కాదన్నారు.

కమిటీ అందించే నివేదిక ఆధారంగా గురుకుల విద్యాసంస్థల సమస్యలను గుర్తించి వాటి పరిష్కార మార్గాలను ప్రభుత్వానికి సూచిస్తామని కేటీఆర్ చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకుంటే వివిధ రూపాల్లో ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకువచ్చేలా కార్యాచరణ రూపొం దిస్తామన్నారు. ఈ అంశాన్ని తాము రాజకీయం చేయాలని ప్రయత్నించటం లేదని చెప్పారు. విద్యార్థుల మరణాలను నివారించటం విఫలమవటం, వారికి నాణ్యమైన ఆహారాన్ని అందించలేకపోతున్న దానిపై ప్రభుత్వమే ఆత్మవిమర్శ చేసుకోవాలని కేటీఆర్ సూచించారు. అదే విధంగా కమిటీ నివేదికలో ప్రస్తావించే అంశాలను తాము శాసన సభలో లేవనెత్తుతామని ఈ సందర్భంగా కేటీఆర్ తెలిపారు.

# అదానీ వ్యవహారంపై దద్దరిల్లిన పార్లమెంట్

(మొదటి పేజీ తరువాయి)

వచ్చినవి కాగా, ఇతర నోటీసులు మణిపూర్, ఉత్తర ప్రదేశ్ సంభాల్‌లో హింసాకాండపై చర్చను కోరాయి. నోటీసులు ఇచ్చిన కాంగ్రెస్ సభ్యుల్లో జీసి చంద్రశేఖర్, రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా, సయ్యద్ నసీర్ హుస్సేన్, నీరజ్ దంగి, రేణుకా చౌదరి, రాజీవ్ శుక్లా, ప్రమోద్ తివారి, అఖిలేశ ప్రసాద్ సింగ్, జెబీ మథెర్ హిషమ్ ఉన్నారు. అయితే, 'ఢిల్లీలో పెరుగుతున్న నేరాల'పై చర్చించేందుకు సభ ఇతర కార్యక్రమాలను వాయిదా వేయాలని కోరుతూ ఆప్ సభ్యుడు సంజయ్ సింగ్ నోటీస్ ఇచ్చారు. మణిపూర్‌లో హింసాకాండపై చర్చ కోసం ఇదే నిబంధన కింద సుష్మితా దేవ్ (టిఎంసి), తిరుచ్చి శివ (డీఎంకె), రాఘవ్ చడ్డా (ఆప్), సందోష్ కుమార్ పి (సిపిఐ) వేర్వేరు నోటీసులు ఇచ్చారు. ఉత్తర ప్రదేశ్ సంభాల్‌లో ఇటీవలి హింసాకాండపై చర్చ కోసం జాన్ బ్రిట్టాస్ (సిపిఐ ఎం), ఎఎ రహీమ్ (సిపిఐ ఎం), రామ్ గోపాల్ యాదవ్ (ఎస్‌పి), అబ్దుల్ వాహబ్ (ఐయుఎంఎల్) నోటీసులు ఇచ్చారు. తొలుత చైర్మన రాజ్యసభ సభ్యులు బికాష్ రంజన్ భట్టాచార్య, వన్‌వెయ్‌రాయ్ ఖర్లుఖి, ధర్మ్‌శిల గుప్తాలకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## హైదరాబాద్‌లోని చెరువులపై పూర్తి పర్యవేక్షణ మాదే : హైకోర్టు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లోని అన్ని చెరువులకు సంబంధించి పూర్తి పర్యవేక్షణ తమదేనని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. రామమ్మ చెరువు బఫర్‌జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు జరగకుండా చూడాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. హెచ్ఎండీఏ పరిధిలో 3 వేల 532 చెరువులు ఉన్నాయని జులైలో జరిగిన విచారణ సందర్భంగా ప్రభుత్వం తెలపగా వాటన్నింటికీ బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌ను నిర్ధరించాలని హైకోర్టు ఆదేశించింది.

విచారణకు హాజరైన హెచ్ఎండీఏ కమిషనర్ ఇప్పటివరకు 2,793 చెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్లు జారీ చేసినట్లుగా తెలిపారు. 530 చెరువులకు సంబంధించి తుది నోటిఫికేషన్లు పూర్తయినట్లుగా వెల్లడించారు. హైదరాబాద్ పరిధిలోని అన్ని చెరువులకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను నిర్ధరిస్తూ తుది నోటిఫికేషన్ జారీకి 3 మాసాల సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది హైకోర్టును కోరగా అందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. తదుపరి విచారణను డిసెంబరు 30వ తేదీకి వాయిదా వేసింది.

## గురుకుల పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్య

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గురుకుల పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం వనపర్తి జిల్లా మదనాపురంలో చోటు చేసుకుంది. వనపర్తి జిల్లా మదనాపురం బాలుర గురుకులంలో కొన్నూరు గ్రామానికి చెందిన 7వ తరగతి విద్యార్థి ప్రవీణ్ దుప్పటితో ఫ్యాన్‌కి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు ఈ విద్యార్థి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో తెలియదు.. కానీ.. ఎవరూ లేని సమయంలో ఈ సంఘటన జరిగిందని తోటి విద్యార్థులు చెబుతున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## జనవరి 10 నుంచి వైకుంఠ ద్వార దర్శనం

- 19 వరకు నిర్వహణ

**బలగం టీవి, తిరుమల**

తిరుమలలో జనవరి 10 నుంచి 19 వరకు శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి టీటీడీ ఏర్పాట్లు చేస్తున్నది. బుధవారం ఆయాశాఖల అధికారులతో అడిషనల్ ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి సమీక్ష నిర్వహించారు. పది రోజులపాటు జరిగే దర్శనాల్లో సాధారణ భక్తులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా వీఐపీలు మినహా.. ఆర్జిత సేవలు, వృద్ధులు, దివ్యాంగులు, ఆర్మీ, ఎన్ఆర్ఐ దర్శనాలు రద్దు చేస్తున్నట్టు వెల్లడించారు. జనవరి 10న స్వర్ణరథం ఊరేగింపు, 11న చక్రస్నానం నిర్వహించనున్నట్టు తెలిపారు.

## 30న మహబూబ్‌నగర్‌లో రైతు సదస్సు

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను 30వ తేదీన మహబూబ్‌నగర్‌లో జరిగే రైతు సదస్సులో వివరించడం జరుగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జూమ్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గురువారం మహబూబ్‌నగర్‌లో భారీ ఎత్తున వ్యవసాయ ప్రదర్శన ఉందన్నారు. మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాల వారీగా ఆయా ఇంచార్జ్ మంత్రులు ఈ కార్యక్రమాలను తీసుకోవాలన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మహబూబ్‌నగర్ రైతు సదస్సు పెద్ద ఎత్తున విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ 12 నెలల్లో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయలేనంత గొప్ప కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో చేపట్టిందన్నారు. ఇప్పటికే సంవత్సరం పూర్తవుతున్న నేపథ్యంలో వరంగల్‌లో, వేములవాడలో భారీ బహిరంగ సభలు నిర్వహించి విజయోత్సవాలను జరిపామన్నారు. 30న మహబూబ్‌నగర్‌లో పెద్ద ఎత్తున రైతు పండుగ నిర్వహిస్తున్నామని, ఈ రైతు ఉత్సవం గతంలో ఎవరు చేయలేనంత పెద్ద ఎత్తున జరగాలన్నారు. న భూతో న భవిష్యతి అన్నట్టుగా భారీ బహిరంగ సభ నిర్వహించి రైతులకు, వ్యవసాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు వివరించాలన్నారు. రైతులను మహబూబ్‌నగర్ తరలించాలని సూచించారు.

# త్వరలో వికలాంగులకు రూ. 6000 పింఛను



- మంత్రి సీతక్క
- గచ్చిబౌలి స్టేడియంలో వికలాంగుల క్రీడోత్సావాలు ప్రారంభం

**బలగం టీవీ, హైదరాబాద్**

వికలాంగులకు ప్రకటించిన 6000 ల పెన్షన్ కూడా వీలైనంత త్వరగా అందిస్తామని, వికలాంగుల సమస్యలు పరిష్కరించాడినికి ముఖ్య మంత్రి వర్యులు సిద్ధంగా ఉన్నారని మంత్రి సీతక్క తెలిపారు. బుధవారం గచ్చిబౌలి స్టేడియంలో వికలాంగుల క్రీడోత్సావాలు మంత్రి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, సాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డీ ,వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య ముత్తినేని , ఉమెన్ కార్పొరేషన్ చైర్మన్ బంద్రు శోభారాణి , సెక్రటరి అనితా రామచంద్రన్ , డైరెక్టర్ శైలజ పాల్గొన్నారు

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రపంచ వికలాంగుల దినోత్సవము ను వికలాంగులకు పండుగ రోజులా ఘనంగా జరుపుకుందాం అన్నారు. ఏదో ఒక రకమైన వైకల్యం ఉన్నప్పటికీ ఆత్మ స్థైర్యం తో, బలమైన సంకల్పం తో వికలాంగులు క్రీడల్లో ప్రపంచ స్థాయిలో పతకాలు సాధించడం నిజంగా చారిత్రిక అంశం అన్నారు వరంగల్ బిడ్డ జీవన్ జీ దీప్తి పారా ఒలింపిక్ క్రీడలలో బ్రాంజ్ మెడల్ సాధించి దేశం గర్వించేలా చెసింది అన్నారు ఆమెకి ముఖ్య మంత్రి వర్యులు గౌరవ రేవంత్ రెడ్డి ఆద్వర్యంలో మాట్లాడి కోటి రూపాయలు నగదు,500 ల గజాల స్థలం ఇచ్చామని గ్రూపు 2 ఉద్యోగం కూడా త్వరలోనే ఇస్తామని చెప్పారు వికలాంగులకు ప్రకటించిన 6000 ల పెన్షన్ కూడా వీలైనంత త్వరగా అందిస్తామని,వికలాంగుల సమస్యలు పరిష్కరించాడినికి ముఖ్య మంత్రి వర్య లు సిద్ధంగా ఉన్నారని తెలిపారు త్వరలోనే బ్యాక్ లాగ్ ఉద్యోగాల ను కూడా నింపుతామని తెలియ జేశారు

పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పరంగా వికలాంగులు సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని తెలియ జేశారు శాట్స్ చైర్మన్ శివసేన రెడ్డీ మాట్లాడుతూ రాబోయే స్పోర్ట్స్ పాలసీలో వికలాంగులకు పెద్ద ఎత్తున ప్రాధాన్యం ఇస్తామని , శాట్స్ ఎల్లప్పుడూ వికలాంగ క్రీడాకారులను ప్రో త్సాహించడానికి సిద్ధంగా ఉంది అని తెలియజేశారు

వికలాంగుల కో–ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ వికలాంగ క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా అధునాతనమైన పరికరాల కోసం 3 లక్షలు రూపాయలు కేటాయించేలా అన్ని రకాల సహాయ ఉపకరణాలు లో 5 % రిజర్వేషన్ నీ కల్పించడానికి మేనేజ్ మెంట్ కమిటీ లో తీర్మానం చేశామని అన్నారు జీవన్ జీ దీప్తి కీ కోటి రూపాయలు నగదు తో పాటు 500 ల గజాల ఇంటి స్థలం, గ్రూప్ 2 ఉద్యోగం కేటాయించి నందుకు పారా స్పోర్ట్స్ గౌరవాధ్యక్షుడు గా,కార్పొరేషన్ చైర్మన్ గా సమస్త వికలాంగుల తరుపున గౌరవ ముఖ్య మంత్రి వర్యులు రేవంత్ రెడ్డి గారికి, గౌరవ మంత్రి వర్యులు సీతక్క గారి కి, శాట్స్ చైర్మన్ శివ సేనా రెడ్డీ గారికి ధన్యవాదాలు తెలిపారు ఉమెన్ కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి మాట్లాడుతూ వికలాంగులు కి ప్రభుత్వం ఎల్లపుడూ అండగా ఉంటుంది అన్నారు

# గడ్డి మందు తాగి బాలిక మృతి

- తల్లి మందంచినందుకే ఆత్మహత్య చేసుకున్న కూతురు
- కుటుంబంలో విషాద ఛాయలు



**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

తల్లి మందలించిందని బాలిక గడ్డి మందు తాగి మృతి చెందింది. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి,దేవుని గుట్ట గ్రామపంచాయతీ పరిధిలోని చింతకుంట తండాలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బాలోతు తిరుపతి మంజుల అనే దంపతులు పది సంవత్సరాల క్రితం మండల కేంద్రంలోని ఓ బట్టల దుకాణం నిర్వహిస్తుండేవారు. వీరికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. తండ్రి తిరుపతి సుమారు ఎనిమిది సంవత్సరాల క్రితం మరో యువతిని వివాహం చేసుకొని వెళ్లిపోయాడు. అప్పటినుంచి తల్లి మంజుల తానే ఐ బట్టల షాప్ నడిపించుకుని కుటుంబాన్ని పోషిస్తున్నది. కూతురు రిషిత (17) ఇంటర్ వరకు పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటోంది.ఈనెల 20వ తారీఖున ఆమెను ఏదైనా కోచింగ్ తీసుకోవాలని,అలాగే ఇంట్లో పనులు చేసుకోవాలని తల్లి మందలించింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన రిషిత సాయంత్రం సుమారు 6 గంటల ప్రాంతంలో గడ్డి మందు సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. రిషిత గడ్డి మందు సుమారు 60 ఎంఎల్ తీసుకోవడంతో డాక్టర్లు ముందస్తుగానే కుటుంబ సభ్యులకు ఆమె బతకడం కష్టమని తెలిపినట్లు సమాచారం.సుమారు ఏడు రోజులుగా కొన ఊపిరితో కొట్టుమిట్టాడి చివరికి మంగళవారం సాయంత్రం మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యుల రోదలను స్థానికులను మిన్నంటాయి. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకెళ్లి బుధవారం అంతక్రియలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై రమాకాంత్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు




# అగ్రిమెంట్ ప్రకారం పాలిస్టర్ పవర్లూమ్ కార్మికులకు కూలీ ఇవ్వాలి...

**బలగం టీవీ , సిరిసిల్ల**

పాలిస్టర్ పవర్లూమ్ కార్మికుల కు కూలీ తగ్గించకుండా అగ్రిమెంట్ ప్రకారం 10 పీకులకు 25 పైసల కూలి చెల్లించాలని పాలిస్టర్ పవర్లూమ్ రాష్ట్ర అధ్యక్షుడు ముశం రమేష్ అన్నారు.

బుధవారం సిరిసిల్ల పట్టణంలోని బి వై నగర్ లో ని అమృత్లాల్ శుక్ల కార్మిక భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ము సం రమేష్ మాట్లాడుతూ మాంద్యం పేరుతోటి పాలిస్టర్ యజమానులు అగ్రిమెంట్ ప్రకారంగా 10 పీకులకు 25 పైసలు చెల్లించకుండా 22 పైసలు కార్మికులను ఇస్తున్నారని,యజమానుల వైఖరిని సిఐటియు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది అని అన్నారు.వెంటనే ఈ వారం వేతనాలు అగ్రిమెంట్ ప్రకారంగా 10 పీకులకు 25 పైసలు చొప్పున చెల్లించాలని లేనియెడల సోమవారం రోజున పాలిస్టర్ అసోసియేషన్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం కార్మికులతో చేపట్టడం జరుగుతుందని అన్నారు.

ఇప్పటికే కార్మికులు పెరిగిన నిత్యవసర సరుకుల ధరలకు తట్టుకోలేక ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు అని అన్నారు.ఇంకా కూలి తగ్గించి ఇస్తే, కార్మికులు ఏ విధంగా బతకాలో ఒకసారి యజమానులు ఆలోచించాలని, కూలీ తగ్గించి ఇవ్వడం వలన కార్మికులకు రోజుకు వంద రూపాయల చొప్పున నెలకు 2500 వరకు కూలి కోల్పోవడం జరుగుతుందని అన్నారు.ఇప్పటివరకు అమలవుతున్నటువంటి అగ్రిమెంట్ మే నెల వరకే అయిపోయిందిఅని,కొత్తగా కూలి పెంచవలసింది పోయి కూలి తగ్గించి కార్మికులను శ్రమదోపిడికి గురి చేయడం సరైన విధానం కాదని అన్నారు.ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు యజమాలపై చర్యలు తీసుకోవాలని, అగ్రిమెంట్ ప్రకారంగా కూలీ అమలు చేసుకునేందుకు కార్మికులందరూ ఐక్యంగా పోరాటం చేయాలని ఆదివారం రోజున కూలి పెంచి ఇవ్వకుంటే సోమవారం అందరూ కార్మికులు సిఐటియు కార్యాలయం వద్దకు రావాలని అన్నారు.ఈ సమావేశంలో పవర్లూమ్ వర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షులు.గుండు రమేష్. సహాయ కార్యదర్శి బెజిగాం సురేష్. బింగి సంపత్. లక్ష్మణ్. సందు పట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు

# నిబంధనల ప్రకారం పీఎం విశ్వకర్మ అందించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల:**

అర్హులకు నిబంధనల ప్రకారం పీఎం విశ్వకర్మ అందించాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. బుధవారం పీఎం విశ్వకర్మ పై జిల్లా సమీకృత కార్యాలయాలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీఓలతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాలోని అన్ని మండలాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు నుంచి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎన్ని పెండింగ్ లో ఉన్నాయో వివరాలు తెలుసుకున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారి అప్లికేషన్, డిక్లరేషన్, కులం సర్టిఫికెట్, ఆధార్ కార్డు ఇతర వివరాల ప్రింట్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని జీఎం ఇండస్ట్రీస్ కు పంపించాలని ఆదేశించారు. దరఖాస్తుల స్క్రూటినీ, ఇతర అంశాలు ఆన్లైన్ లో నమోదు చేసే విషయమై ఏమైనా ఇబ్బందులు ఎదురైతే ఆయా శాఖల అధికారులను సంప్రదించాలని సూచించారు.




**మండలాలు.. మున్సిపాలిటీల వారీగా దరఖాస్తులు..**

సిరిసిల్ల మున్సిపాలిటీలో 101, వేములవాడ మున్సిపాలిటీ లో 72, బోయినపల్లి మండలం లో 178, చందుర్తి మండలంలో 232, ఇల్లంతకుంట మండలంలో 667, గంభీరావుపేట మండలంలో 185, కోనరావుపేట మండలంలో 347, ముసాబాద్ మండలంలో 166, రుద్రంగి మండలంలో 61, తంగళ్లపల్లి మండలంలో 372, వీర్నపల్లి మండలంలో 168, వేములవాడ రూరల్ మండలం 38, వేములవాడ అర్బన్ మండలం 237, ఎల్లారెడ్డిపేట మండలం నుంచి 274 దరఖాస్తులు ఆన్లైన్ అయ్యాయి.ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, ఇండస్ట్రీస్ ఏడీ భారతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్, ఎల్డీఎం మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఎల్లారెడ్డిపేటలో ఫ్లెక్సీల తొలగింపులో పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం ఎందుకు..?'



**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలో ఫ్లెక్సీలు కొన్ని రోజులుగా రోడ్లకు ఇరువైపులా ఉండడంతో పలుమార్లు పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లినా వాటిని తొలగించడంలో నిర్లక్ష్యం ఎందుకు చేస్తున్నారని గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల శ్రీ వేణుగోపాల స్వామి రథోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు రోడ్డుకు ఇరువైపులా పెట్టడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనీ,ఆరోపిస్తూ వాటిని తొలగించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి కు వినతి పత్రం సమర్పించారు. బీఆర్ఎస్ నాయకులు పలుమార్లు ఎంపీడీవో సత్యనారాయణకు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్‌కు తెలుపగా పట్టించుకోలేదని ఆరోపించారు. సీన్ ఉల్టా పల్టాగా మారింది.రోడ్డు పై కాంగ్రెస్ పార్టీ నాయకులు పెట్టిన ఫ్లెక్సీలు గ్రామంలో అనేక చోట్ల ఉన్నా ఫ్లెక్సీలను పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ వదిలేసి బీఆర్ ఎస్ నాయకులు పెట్టిన ఫ్లెక్సీ లు మాత్రం పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీ కార్యాలయానికి తరలించగా కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలు మాత్రం యదావిధిగా కొత్త బస్ స్టాండ్ నుండి మొదలుకొని గ్రామంలోపలీ వరకు దర్శనం ఇస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా కొంతమంది ఒక్కొక్క షాపుకు రెండు, మూడు ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేసి ప్రధాన రహదారిపై పెద్దపెద్ద బండరాయిలతో ఏర్పాటు చేశారు. వాహదారులు పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేసినా కూడా వాటిని తీసేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కాగా పంచాయతీ కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పనిచేస్తున్నారని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు.

# బజరంగ్ పునియాపై 4 ఏండ్ల సస్పెన్షన్

- శాంపిల్స్ ఇవ్వడానికి నిరాకరించాడని నిషేధం విధించిన నాడా

**బలగం టీవి, న్యూఢిల్లీ**

భారత స్టార్ రెజ్లర్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత బజరంగ్ పునియా డోపింగ్ టెస్ట్ కోసం శాంపిల్స్ ఇవ్వడానికి నిరాకరించినందుకు ు నాలుగేళ్లపాటు నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (నాడా) సస్పెండ్ చేసింది.

వివరాల్లోకెళ్తే.. ఈ ఏడాది మార్చి 10న జాతీయ జట్టుకు ఎంపిక కోసం జరిగిన సెలక్షన్ ట్రయల్స్‌లో బజరంగ్ పునియా తన యూరిన్ శాంపిల్స్ ఇవ్వడానికి నిరాకరించాడు. దీంతో ఇదే నేరానికి సంబంధించి నాడా ఈ ఏడాది ఏప్రిల్ 23న బజరంగ్ పునియాను తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ఆ తర్వాత ప్రపంచ రెజ్లింగ్ గవర్నింగ్ బాడీ కూడా బజరంగ్‌పై నిషేధం విధించింది. అలాగే బజరంగ్ ఎందుకు శాంపిల్స్ ఇవ్వడానికి నిరాకరించాడో వివరణ కోరుతూ నోటీసు ఇవ్వమని ప్రపంచ డోపింగ్ నిరోధక ఏజెన్సీ.. నాడాకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో నాడా ఏప్రిల్ 26లోపు వివరణ ఇవ్వాలని పూనియాకు నోటీసు జారీ చేసింది. అందుకు పూనియా స్పందించలేదు. అయితే నాడా మే 7లోపు వివరణ ఇవ్వాలని మళ్లీనోటీసు జారీ చేసింది. ఆ నోటీసులకు కూడా పూనియా సమాధానమివ్వలేదు. దీంతో ఈ ఏడాది మేలో నాడా అతడిపై తాత్కాలిక నిషేదం విధించింది.

అయితే నాడా నోటిసులకు స్పందించని బజరంగ్ పూనియా.. నాడా యాంటీ డిసిప్లినరీ డోపింగ్ ప్యానెల్‌కు మాత్రం తన వివరణ ఇచ్చాడు. పరీక్షల కోసం నాడా అధికారులు గడువు దాటిన కిట్‌లను వాడడంతోనే నమూనాలను ఇవ్వలేదని చెప్పుకొచ్చాడు. దీంతో మే 31న



బజరంగ్‌పై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) విధించిన సస్పెన్షన్‌ను నాడా క్రమశిక్షణ సంఘం (ఏడీడీపీ) తాత్కాలికంగా ఎత్తివేసింది. కాగా ఈ ఏడాది జూన్ 23న మరోసారి నాడా బజరంగ్ పునియాకు నోటీసులు ఇచ్చింది. జూలై 11 లోపు వివరణ ఇవ్వాలని నోటీసులో నాడా పేర్కొంది. ఈసారి తనపై వచ్చిన ఆరోపణలకు బజ్‌రంగ్ జులై 11న రాతపూర్వకంగా సమాధనమిచ్చాడు. ఆ తర్వాత సెప్టెంబరు 20, అక్టోబరు 4న భజరంగ్ వివాదంపై ఏడీడీపీ ప్యానల్ విచారణ చేపట్టింది. ఈ విచారణలో అతడు డోపింగ్ నిబంధలు ఉల్లంఘించినట్లు ఏడీడీపీ గుర్తించింది. ఈ క్రమంలోనే అతడిపై నాడా నాలుగేళ్ల పాటు నిషేధం విధించింది.

## బీజేపీలో చేరితే నిషేధం ఎత్తివేస్తారు : బజ్‌రంగ్ పునియా

నాడా తనపై విధించిన నిషేధం పై రెజ్లర్ బజ్‌రంగ్ పునియా స్పందించారు. బీజేపీలో చేరితే తనపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తారని వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ "ఇదేమీ షాకింగ్‌గా అనిపించలేదు. గత ఏడాది కాలంగా ఈ అంశం నలుగుతోంది. నాడాకు నమూనాలు ఇచ్చేందుకు నేను నిరాకరించలేదని గతంలోకూడా వెల్లడించాను. డోప్‌టెస్ట్ చేసేందుకు మా ఇంటికి వచ్చినప్పుడు.. అధికారులు గడువు ముగిసిన కిట్ తీసుకొని వచ్చారు. దానికి గురించి నేను సోషల్ మీడియాలో వెల్లడించాను. మహిళా రెజ్లర్లకు మద్దతుగా నిరసనల్లో పాల్గొన్నందుకు వారు రివేంజ్ తీర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. నేను గత 10 నుంచి 12 ఏళ్లుగా రెజ్లింగ్‌లో పోటీపడుతున్నాను. టోర్నమెంట్‌లలో భాగంగా నమూనాలు ఇచ్చాను. మమ్మల్ని విడదీసి, వారి ముందు తలవంచేలా చేయాలన్నదే ప్రభుత్వం ఉద్దేశంలా కనిపిస్తోంది. నేను బీజేపీలో చేరితే ఈ నిషేధాలన్నీ ఎత్తివేస్తారనుకుంటున్నా" అని ఆరోపించారు.




## ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్.. టాప్‌లోకి బుమ్రా, జైస్వాల్

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఐసీసీ తాజాగా టెస్టు ర్యాంకింగ్స్ విడుదల చేసింది. బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో అద అద్భుతంగా రాణించిన ఫాస్ట్ బౌలర్ బుమ్రా ఐసీసీ మెన్స్ టెస్ట్ బౌలర్ ర్యాంకింగ్స్‌లో టాప్ ప్లేస్‌కు దూసుకెళ్లాడు. ఆస్ట్రేలియాతో పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో.. బుమ్రా కీలకమైన 8 వికెట్లు తీసుకున్నాడు. మ్యాచ్ ముందు వరకు టీమ్‌ఇండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఒకటి నుంచి మూడో స్థానంలో పడిపోయాడు. ఇప్పుడు ఆసీస్‌పై అద్భుత ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచి, మళ్లీ ఐసీసీ ర్యాంకుల్లో అగ్రస్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుతం బుమ్రా 883 పాయింట్లతో తొలి స్థానాన్ని కైవసం చేసుకోగా, కగిసో రబాడ (872), జోష్ హేజిల్‌వుడ్ (860) తర్వాతి స్థానాలను సొంతం చేసుకున్నారు. ఇక రవిచంద్రన్ అశ్విన్ (807) ఒక స్థానం మెరుగుపర్చుకుని నాలుగో స్థానానికి దూసుకొచ్చాడు. రవీంద్ర జడేజా ఏడో స్థానంలో నిలిచాడు.

ఇదిలా ఉండగా, ఆస్ట్రేలియాపై వరుస సెంచరీలు బాదిన యంగ్ క్రికెటర్ యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లి తమ ర్యాంకులను మెరుగుపర్చుకున్నారు. 825 పాయింట్లతో జైస్వాల్ రెండు ర్యాంకులు పైకి వచ్చి రెండో స్థానాన్ని సాధించగా, 903 పాయింట్లతో ఇంగ్లాండ్ ప్లేయర్ జో రూట్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇక రిషభ్ పంత్ (736) ఆరో స్థానానికి పరిమితమవ్వగా, రన్నింగ్ మెషిన్ విరాట్ కోహ్లి 689 పాయింట్లతో ఏకంగా 9 స్థానాలకు ఎగబాకాడు. ప్రస్తుతం 13వ ర్యాంకులో ఉన్నాడు. ఇక గాయం కారణంగా తొలి టెస్టుకు దూరమైన శుభ్‌మన్ గిల్ 17వ స్థానంలో ఉన్నాడు.

ఇదిలా ఉండగా, టెస్టుల్లో అత్యుత్తమ ఆల్‌రౌండర్లుగా రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ కొనసాగుతున్నారు. 423 పాయింట్లతో జడేజా, 290 పాయింట్లతో అశ్విన్ తొలి రెండు స్థానాలను కైవసం చేసుకున్నారు. ఇక టాప్ -10లో భారత్ నుంచి అక్షర్ పటేల్ (239) కూడా ఉన్నాడు. ప్రస్తుతం అతడు ఏడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక వన్డే బ్యాటింగ్ ర్యాంకుల్లో టాప్-5లోనే భారత జట్టు నుంచి నుంచి ముగ్గురు ఉన్నారు. పాకిస్థాన్ ప్లేయర్ బాబర్ అజామ్ (809) అగ్రస్థానంలో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో రోహిత్ శర్మ (765), శుభ్‌మన్ గిల్ (763), విరాట్ కోహ్లి (746) ఉన్నారు.





## 'స్క్విడ్ గేమ్ 2' ట్రైలర్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రపంచ వ్యాప్తంగా విశేష ప్రేక్షకాదరణను దక్కించుకున్న కొరియన్ వెబ్ సిరీస్ స్క్విడ్ గేమ్ సిరీస్‌కు కొనసాగింపుగా 'స్క్విడ్ గేమ్ 2' రెడీ అవుతోంది. డిసెంబర్ 26 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో ఇది స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానుంది. ఈ క్రమంలోనే తాజాగా మేకర్స్ ఈ సీక్వెల్‌కు సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేశారు.తొలి సీజన్ తరహాలోనే రెండో సీజన్‌లోనూ ఆర్థికంగా ఇబ్బందులు పడే కొంత మంది, డబ్బు సంపాదించడం కోసం ఈ గేమ్‌లో భాగం అవుతారు. అయితే గత సీజన్‌లో ఈ డేంజరస్ గేమ్ నుంచి బయటపడిన 456వ పోటీ దారుడు సియోంగ్ గి-హున్ ఇందులో మళ్లీ పాల్గొంటాడు. ఈ గేమ్ చాలా డేంజరస్ అని తోటి పోటీ దారులకు హెచ్చరిస్తాడు. ఎలాగైనా ఈ గేమ్‌ను ఆపాలని ప్రయత్నిస్తుంటాడు. అసలు ఈ గేమ్‌ను ప్రవేశపెట్టిన వారికి అంతమొందించాలనుకుంటాడు. మరి ఇంతకీ అతడు ఈ గేమ్‌ను ఆపగలిగాడా లేదా అన్నదే కథ.

## ప్రియుడిని పరిచయం చేసిన కీర్తి సురేశ్

**బలగం టీవి, హైదరాబాద్**



నటి కీర్తి సురేశ్.. తనకు కాబోయే వాడిని పరిచయం చేసింది. ఆంటోని తట్టిళ్‌తో 15 ఏళ్లుగా ప్రేమలో ఉన్న విషయాన్ని బయటపెట్టింది. ఇద్దరూ కలిసున్న ఫొటోని సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది గానీ ఫేస్ మాత్రం రివీల్ చేయలేదు. ఇద్దరూ సూర్యుడివైపు చూస్తున్న ఓ అందమైన ఫొటోను పంచుకున్నారు. ట్వీట్‌కు లవ్ సింబల్‌తో AntoNY x KEerthy ( Iykyk ) ' అని క్యాప్షన్ పెట్టారు. ఈ ట్వీట్ చూసిన అభిమానులు, నెటిజన్లు కీర్తికి శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

మలయాళ నిర్మాత సురేశ్, నటి మేనకల కూతురైన కీర్తి సురేశ్.. బాలనటిగా చేసింది. 'నేను శైలజ' మూవీ హీరోయిన్ అయింది. తెలుగు, తమిళ, మలయాళంలో నటించింది. హిందీలోనూ ఈమె తొలి మూవీ 'బేబీ జాన్' త్వరలో రిలీజ్ కానుంది. ఆంటోనీ దుబాయ్‌కి చెందిన వ్యాపారవేత్త అని తెలిసింది. ఆంటోని ఇంజినీరింగ్ చేసి ఖతార్‌లో కొన్నాళ్లు పనిచేసాడని తిరిగి స్వదేశానికి వచ్చి కొచ్చిలో విండో సొల్యూషన్స్ కోసం యాస్పెరాస్ కంపెనీ పెట్టాడని తెలిసింది. తర్వాత హెూటల్స్ వ్యాపారంలోనూ అడుగుపెట్టాడని సమాచారం. వీరిద్దరూ కలిసి అతను, కీర్తి ఒకే పాఠశాలలనే చదివినట్లు సదరు కథనాలు పేర్కొంటున్నాయి. డిసెంబర్ 11, 12 తెదీల్లో గోవాలో పెండ్లి జరగబోతోందని టాక్.

## 'రాబిన్‌హుడ్' నా కెరీర్ లో హయ్యస్ట్ బడ్జెట్ మూవీ : హీరో నితిన్

**బలగం టీవి, హైదరాబాద్**



హీరో నితిన్ వెంకీ కుడుముల దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం రాబిన్‌హుడ్. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హై బడ్జెట్ తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్ గా నటిస్తున్నారు. ఈ మూవీ డిసెంబర్ 25న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతుంది. ఈ సందర్భంగా టీం ఫస్ట్ కనెక్ట్ ప్రెస్ మీట్ ని నిర్వహించింది. హీరో నితిన్ మాట్లాడుతూ.. "నేను, వెంకీ కలిసి చేస్తున్న సెకండ్ ఫిల్మ్ ఇది. 'భీష్మ' మ్యాజిక్ ఈ సినిమాతో మళ్లీ రిపీట్ అవుతుందని స్ట్రాంగ్ గా బిలీవ్ చేస్తున్నాను. శ్రీలీలతో కూడా ఇది నా సెకండ్ ఫిల్మ్. ఈ సినిమాతో మా పెయిర్ హిట్ పెయిర్ అనిపించుకుంటుందని స్ట్రాంగ్ గా నమ్ముతున్నాను. ఈ సినిమా నుంచి వచ్చిన టీజర్, సాంగ్ కి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇంత మంచి సాంగ్స్ ఇచ్చిన జీవి ప్రకాష్ కి థాంక్యూ. మైత్రి మూవీ మేకర్స్ నవీన్ గారు రవి గారు లేకపోతే ఈ సినిమా ఇంత రిచ్, ఇంత గ్రాండ్ గా వచ్చేది కాదు. నా కెరియర్ లోనే ఇది హయ్యస్ట్ బడ్జెట్ సినిమా. ఒక విషయం కాన్ఫిడెంట్ గా చెబుతున్నా. డిసెంబర్ 25 నాడు రాబిన్‌హుడ్ నిర్మాతలు పెట్టిన డబ్బుని రెంట్టింపుతో సహా మీనుంచి దోచుకొని వారికి ఇస్తాడు.' అన్నారు. శ్రీలీల మాట్లాడుతూ.. నా క్యారెక్టర్జేషన్ పరంగా పెర్ఫార్మెన్స్ పరంగా చాలా డిఫరెంట్ గా ఉండే సినిమా ఇది.